రచన - జనవరి 1996

# రహస్యం

జానకమ్మగారికి ఆ వేళ సరిగ్గా నిద్రపట్టలేదు. ఓ రాత్రి వేళ మెలుకువ వచ్చింది. పడుకున్నది కాస్తా ఓపిక తెచ్చుకుని లేచి గోడకానుకుని కూర్చుంది. నోరు పిడచకట్టినట్టు అన్పిస్తే రాగి చెంబులో నీటితో దాహం తీర్చుకుంది. అయినా గొంతు తడి తగ్గనే లేదు. పైగా కలత నిద్రలోనే ఓ కల... ఏనాడో పోయిన భర్త వచ్చి పక్కన కూర్చుని యోగక్షేమాలు అడుగుతూ 'ఎలా వున్నావ్, రోజులెలా వెడుతున్నాయి. నీ ముత్తయిదువతనం హరించి నిన్ను ఏకాకిని చేసి నేను బావుకున్నదేం లేదు. నా కన్నా నువ్వే అదృష్టవంతురాలివి. మూడో తరం జనాన్ని చూస్తున్నావు... ప్రాపంచిక విషయాల్లో తల మునకలవడం తగ్గించి పరమాత్మని దగ్గర చేసుకోవడం అలవాటు చేసుకో... కాశీలో కొన్న తాపళం నీ తలక్రిందనే పెట్టుకో... దాన్ని మర్చిపోకు..." అంటూ నవ్వేసి వెళ్ళబోతూ ఆగి, "చెప్పడం మర్చిపోయాను ... వయసు మీద పడుతూంటే ఏ ఒక్కరి శాంతిని కాజేయకూడదుట... ఎదటి వాళ్ళకు మనం కాస్తంత శాంతిని కానుకగా ఇస్తే అది వెయ్యింతలై మన ఆత్మని వెలగిస్తుందట. మగపిల్లలు కాకుండా పోయారని... నీకు కాని గాయాలు చేసి బాధ పెట్టారని పదే పదే గుర్తు చేసుకోకు... వాళ్ళ తలవ్రాత అంతే..." హెచ్చరికలు సలహాలు యివ్వడంతో చటుక్కున మెలుకువ వచ్చేసింది. భర్త తాకినట్టు అన్పించిన చేతిని తడిమి చూసుకుంది. వెన్ను మీద సుతారంగా తడిమిన ప్రదేశాన్ని కుడి చేత్తో అందుకోవాలని ప్రయత్నం చేస్తే కీళ్ళ నొప్పుల వల్ల చెయ్యి వెనక్కి సాగలేదు. ఓసారి చుట్టూ చూసింది... చీకటి... వంటింట్లోంచి ఉండుండి ఎలుకలు చేస్తోన్న చప్పుడు... పడగ్గదిలోంచి కూతురు నిద్రలో పెట్టేగురక వాకిట్లోకి వినబడుతోంది. ఆవిడకు ఏం తోచలేదు. తలగడ మీదకు నెమ్మదిగా వాలి పడుకుంది. కళ్ళు పొడితనం చేత మూతలు పడక ఆవిడ ఆలోచనల పాలబడింది. అవి చాలామటుకు గతానికి సంబంధించినవి. ఒక్కొక్కసారి ఆ ఆలోచనలు ఆవిడ్ని పదహారో ఏట నుంచి మొదలుపెట్టి మెట్టు మెట్టుగా, మరోసారి క్రిందకీ మీదకి తీసుకువెళతాయి. ఆలోచనలు అల్లిక లేకుండా పోతున్నాయంటే అందుకు అలజడి, బాధాకారణం అవుతాయని ఆవిడ తెల్సుకోలేకపోలేదు. ఓ అరగంట తర్వాత తనలోతనే 'ఎందుకొచ్చింది... పోనిద్దూ' అని వైరాగ్యం, గమ్మున నాలుగు అడుగులు వేసి బుట్టలో పాములా ముడుచుకుపోతుంది. అలా పదిహేను నిముషాలే... మళ్ళీ గతం తనలోకి రా రమ్మని పిలవటం జానకమ్మగారు విలవిల్లాడడం మామూలే... పైగా క్రిందటి రోజు విజయవాడ నుంచి పెద్ద కొడుకు రామానుజం చుట్టపు చూపుగా అన్నట్టు వచ్చాడు. తల్లిని పలకరించి - ఆ పైన నాలుగు ఏపిల్ పళ్ళు పక్కలో పెట్టి, "తిను, ఎలా వున్నావ్? ఆరోగ్యం ఎలా ఉంటుంది? పిల్లల చేతనైనా ఒక ఉత్తరం గిలికించవచ్చు కదా...?" అంటూ అడిగాడు.

జానకమ్మ 'బాగానే ఉన్నానురా' అంటూ ఒకే సమాధానం చెప్పింది.

"అమ్మా, లక్ష్మి నిన్ను అడిగానని చెప్పమంది... పిల్లలు కూడా ఎప్పుడూ నీ గురించే అడుగుతూ వుంటారు" అని అటూ ఇటూ చూసి, "అమ్మా వచ్చి నా దగ్గర ఉండిపోవే ఎన్నాళ్ళు ఇలా?" అని ఆగిపోయాడు.

"ఎక్కడుంటే ఏమిట్రా... ఇక్కడ బాగానే ఉందిగా?"

"లక్ష్మి, మారింది... ఏదో వయసులో దానికి నీ పొడ గిట్టలేదు. అత్తగారితనం అనను గాని, నీకూ మా తరహా నచ్చలేదు.."

"అవన్నీ ఎందుకురా ఇప్పుడు?"

"అది కాదమ్మా..."

"రామానుజం... నీకు గుర్తే... లలిత దగ్గరకు నేనొచ్చి ఇరవై ఏళ్ళు అవుతోంది... ఇక్కడ అలవాటుపడిపోయాను. నేను లేకపోతే పిల్లలకు తోచదు. పైగా సుందరం కూడా ఒక క్షణం నేను కనబడకపోతే 'ఏం చేస్తున్నారు. ఎటు వెళ్ళారు' అంటూ యిదైపోతాడు. అతను నన్ను మీలాగే 'అమ్మా' అని పిలుస్తాడు. ఇంతకాలం ఇక్కడ వుండి ఇప్పుడు సేవ కోసం కోడళ్ళ దగ్గరకు రావడం ఏం బాగుంటుంది చెప్పు?"

రామానుజం మాట్లాడలేదు. తల వంచుకున్నాడు. తల్లి తమని కాదని కూతురు దగ్గర శేష జీవితం వెళ్ళబుచ్చుతోంది. ఇద్దరి మొగ పిల్లల్ని కాదని తల్లి అక్కగారి దగ్గర నిశ్చింతగా బ్రతుకుతోందని  అనుకునేటంత వెర్రివాడు కాదు, అతను!! తను ఆ మాట అన్నా బంధువులూ స్నేహితులు ఆఖరికి పసివాళ్ళు కూడా తనవైపు అదోలా చూడ్డం తనికి తెలుసు! తల్లిని చూడని,ఆదరించి అన్నం పెట్టని ఘనుడని - తన గురించి ఎంతో మంది గుసగుసలాడ్డం తనకి తెలుసు.

రామానుజానికి తనూ, తమ్ముడు రాఘవ చేసిన గొడవ ఎంత పాతదయినా గుర్తుకు వస్తూనే వుంటుంది. నిజమే తండ్రి పోయిన తరువాత ఆస్తి పంపకాల విషయంలో తనూ, తమ్ముడూ తల్లితో భేటీపడ్డారు. తల్లి, ఇంటిని కూతురుకు ఇస్తానంటుంది. మూడు వాటాలుగా విభజించడం న్యాయమంటారు వీళ్ళు.

"కొడుకులకన్నా కోడళ్ళ కన్నా కూతురు ఎక్కువవుతుందా? కొరివి పెట్టేదెవరు?"

"కొరివి పెడతారు కదా అని బయానా అడుగుతార్రా మీరూ, మీ పెళ్ళాలూ..." అంది జానకమ్మ వణికిపోతూ...

"న్యాయం అనేది వుంది కదా?"

"ఏమిట్రా న్యాయం... నాన్నగారికి వంట్లో బాగోలేనప్పుడు చాకిరీ చేసింది ఎవర్రా. మీరూ మీ పెళ్ళాలూ కాదే... ఆ కూతురేరా చేసింది! మీ పెళ్ళాలకు పుస్తెలు మెళ్ళో పడగానే.. .చిన్న చిన్న నలతలు మొదలయ్యాయి మమ్మల్ని చూస్తే.... ఇక అడగనే వద్దు. వాళ్ళు కాదు - మంచాలు కూడా మూలుగులు వినిపించడం నేను ఎరగనివా?"

"నువ్వు తల్లివి కావు... నీకు మా కన్నా ఆస్తి ఎక్కువ. అక్క ఎక్కువ" ఆ పైన పెద్ద పోట్లాట... మామయ్యలు, అయినవాళ్ళు అందరూ వుండి కూడా సంధి కుదర్చలేకపోయారు. రామానుజం తల వంచుకుని కాసేపు అలానే వుండిపోయాడు.

"ఒరే, మనం ఎక్కడ వున్నా తల్లీ కొడుకులం కాకపోం... నీ సంగతి ఎలా వున్నా – నా మటుకు నాకు శాంతిగా బ్రతకాలని వుంది. ఒక వయసులో ఆడైనా మగైనా నోటికి ఎక్కువ సేపు తాళాలు వేసుకుంటే బావుంటుంది. మర్యాదా దక్కుతుంది" అంటూ జానకమ్మ నెమ్మదిగా పడగ్గదిలోకి వెళ్ళింది. సరిగ్గా అప్పుడే పమిట కొంగున చేయి తుడుచుకుంటూ లలిత వచ్చింది వస్తూనే, "ఏమిట్రా రామం..ఆలోచనేనా..."

"ఏం చెప్పమంటావే?"

లలిత నవ్వి, "ఏదో ఒకటి చెప్పు..." అంది.

"అమ్మని నాతో విజయవాడ రమ్మంటే రానంటోందే!!"

"అంతే కదా... ఇంకా ఏదో అనుకున్నాను. పైగా దాని ఆరోగ్యం అంతంత మాత్రంగా వుంది. ఈ దశలో దాన్ని తిప్పడం మంచిది కాదు..."

"కాదు లలితా నిజం నాకు తెలుసు. అమ్మకు మా మీద కోపం ఇంకా పోలేదు... ఇద్దరు కొడుకులు వుండీ ఆ ఇద్దర్నీ కాదని అమ్మ పెర్మనెంట్‌గా నీ దగ్గర వుంటోందంటే – మాకెలా వుంటుంది? అందరి మాటా వదిలేయ్ ఈ వేళ ఈ ప్రశ్న మా పిల్లలే మమ్మల్ని అడుగుతున్నారు. నాకు తల కొట్టివేసినట్టుగా అవుతోంది. పరాయి మనిషి అయిన బావ, కొడుకుగా ఆమెను ఆదుకోవడం మామూలు విషయం కాదు. ఆయన ఉత్తముడు కాబట్టే ఈ పని చేస్తున్నాడు..."

లలిత మాట్లాడలేదు.

"లక్ష్మి కూడా నాతో వస్తానంది. నేనే వద్దన్నాను – ఏం గొడవలు రేగుతాయోనని... దానికీ అల్లుళ్ళను, కోడళ్ళను చూసే వయసు వచ్చింది. అత్తగారికి అన్నం పెట్టకుండా చీదరించుకుని వేరే కాపురం పెట్టించిందన్న ఆడదాన్ని రేపు కోడళ్ళు ఎందుకు గౌరవంగా చూస్తారు. ఎందుకు చూడాలి?? ఆ విషయం దాన్ని దొలవదంటావా??"

లలిత అదోలా నవ్వింది. "తమ్ముడూ ఆ విషయాలన్నీ మర్చిపోవడం మంచిది. ఇందులో తప్పెవరిదీ లేదు. పరిస్థితులు అలాంటివి. మన అమ్మ వల్ల వదినలు కష్టపడలేదా అంటే – కాదని అనలేం. కానీ అమ్మకు తగిలిన గాయం మీ వల్లరా... కొడుకుల వల్లే!! చదువుకోని అమ్మను మీరు ఒకే కోణం నుంచి చూశారు. అమ్మ ప్రాపకంలో బొత్తిగా అమ్మకూచిలై ఆమె చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ పెరిగారు. అమ్మ మీకు లోకం, పరిస్థితులూ తెలియకుండా ఆడపిల్లల్లా, తనలాగే మిమ్మల్ని ఎదగనిచ్చింది. ఆమె తప్ప లోకం లేదని నమ్మిన మీకు అమ్మ చిన్న నిరాదరణ పెద్దగా కన్పించింది..." రామానుజం తలవంచుకున్నాడు.

"తల్లి ఎప్పుడూ తన పిల్లలు ఎంత ఎదిగినా వాళ్లు ఎదగలేదనే అనుకుంటూ తనని

తను మోసం చేసుకుంటుందిట... అదే తండ్రి అయితే పిల్లలుఎదగడం లేదని గుర్తించిన మరుక్షణం - అందుకు తగ్గ వాతావరణం కల్పిస్తాట్ట..."

"అవును..."

"మగవాడు మగవాడుగానే బ్రతకాలి... ఆడదాని కబుర్లు చెప్పకూడదు... అందుకే వదినలు కూడా మీ మూలంగా అవస్థలు పడ్డది..."

"ఇదంతా నా దురదృష్టం..."

"అలా బాధ పడకూడదు రామం... భగవంతుడు మనిషిని బాధపడమని - బాధలు మూటగట్టుకోమని - ఈ లోకంలోకి పంపడుట. కానీ మనమే జీవితాన్ని కళగా తీసుకోవడం తెల్సుకోకుండా ఇలా క్రిందా మీదా అవుతాముట."

"అది కాదు లలితా... నా పెద్దకూతురు సుమిత్ర చదువయ్యింది. డిగ్రీ తీసుకుంది. దానికి సంబంధాల వేటలోనే ఇలా వచ్చాను..."

"అలానా బావుంది..."

"బావుంది కాదే... నేను ఆడపిల్ల తండ్రిగా - మా ఇంట్లో పెళ్ళి కెదిగిన కూతురు వుంది. ఇదీ కథ అంటూ చెప్పడానికి మొదటిసారి ఈ వేళ నీ గుమ్మం ఎక్కాను. మీ వాడు రమేష్... " లలితకు నోట మాట రాలేదు. తమ్ముడు చెప్తుంటే బొమ్మగా వింటోంది.

"అమ్మకు చెబితే - ఈ విషయం విని నా మీద తారాజువ్వలా లేస్తుందని భయం వేసింది. బహుశా మా సంబంధం అమ్మకు ఇష్టం కూడా వుండదేమో??

లలిత నవ్వి ఆ పైన కాసేపు ఆలోచించి, "మీ బావగారిని అడిగి చూడు... నేనేం చెప్తాను... అంతా ఆయన ఇష్టం..."

"మరి నీ ఇష్టం?"

సరిగ్గా అప్పుడే లోపలి నుంచి రమేష్ వచ్చి, "అలా బయటకు వెళ్ళి వస్తాను మామయ్యా?" అంటూ పలకరించాడు.

"బావ ఎప్పుడు వస్తాడే.."

"మరో గంటలో దిగుతారు... నవ్వు స్నానం చెయ్యి..."

లోపలి నుంచి తల్లి సౌందర్యలహరిలోని - "పదంతే కీర్తీనాం ప్రపద నుపదం దే దేవివిపదాం" శ్లోకం చదువుతోంది.... ఆశ్చర్యం.. తల్లి పాదాలు ఆపదలు తొలగించేవిట... అలాంటివి తాబేటి చిప్పలా కఠినం ఎలా అవుతాయి..." అని సంశయం వెలిబుచ్చే జవాబు చెప్పే శ్లోకం. రామానుజం ఆలోచిస్తున్నాడు. రామానుజం హైదరాబాద్‌లో జరిగిన సంగతులు లక్ష్మికి చెప్పి ఆఖరిగా అన్నాడు... "అమ్మను ఎంతో బ్రతిమలాడాడు. ఆవిడకు ఇక్కడకు వచ్చే ఉద్దేశం లేదు."

"మనమేం చేయగలం..."

"అది సరే లక్ష్మీ... మా మేనల్లుడు రమేశం బాగా ఎదిగాడు. చదువు పూర్తయ్యింది. ఉద్యోగం చేస్తున్నాడు..."

"ఆహా..."

"నీతో చెప్పకుండా అక్కడో ఘనకార్యానికి తొందరపడవల్సి వచ్చింది..."

"ఏమిటో అది..."

"మన సుమిత్రకు చేసుకోమని, వాళ్ళను అడిగాను.."

లక్ష్మి ఆశ్చర్యపోయింది మొదట... ఆశ్చర్యం ఆ పైన చిరుకోపంగా మారింది... ఆ కోపాన్ని కూడా అణుచుకుంటూ "ఏమిటీ... మేనరికమా.. చాల్లెండి... మీ అక్కతోనూ, మీ అమ్మతోనూ నేను పడలేను... జరిగింది నేనింకా మర్చిపోలేదండీ..."

రామానుజం ఓసారి భార్య మొహంలోకి చూసి, "బాగా ఆలోచించు. ఇన్నేళ్ళు గడిచిన తర్వాత ఒకళ్ళ నొకళ్ళు తప్పు పట్టుకుని ప్రయోజనం ఏమీ లేదు. నా ఆర్థిక పరిస్థితులు బాగా లేక డబ్బు కోసం నా పరిధిని దాటి నేను మాట్లాడాను. ఆవేశపడ్డాను. కొడుకుగా నా బాధ్యతని విస్మరించి అమ్మను, అక్కే అవుగాక, పరాయి పంచ పాలుజేశాను. నేను చేసిన పనికి నిష్కృతి లేదేమో..."

లక్ష్మి నల్లబడ్డ మొహం పంచుకుంది.

"మా బావ ఆమెకు కొడుకయ్యాడు. మా కన్నా ఆమెకు ఎక్కువే చేశాడు. అలాంటి ఆయన కడుపున పుట్టిన రమేశం కాళ్ళు కడిగితే నా పాపం కొంత తగ్గుతుందేమో. శాంతి లభిస్తుందేమో..."

"మీకు దక్కే శాంతి, పోయే పాపాలు అటుంచండి. అవన్నీ నిజమే అవొచ్చు. కానీ మన సుమిత్రను వాళ్ళు సరిగ్గా చూడకపోతే...??. మనమీద కోపం మన అమ్మాయి మీద చూపిస్తే మనం ఏంచేయగలం? పెళ్ళి చేయవచ్చు. ఆ తర్వాత అది నలిగిపోతుందండీ..."

రామానుజం మాట్లాడలేదు. కాసేపు ఆగి, "సుందరం బావ అలాంటివాడు కాదు..." అన్నాడు.

లక్ష్మి రకరకాలుగా ఆలోచిస్తోంది. రామానుజం కూడా అదే పని చేస్తున్నాడు. ఇద్దరి మధ్యా నిశ్శబ్దం అయితే వుంది గాని, అందులో ఆవేదన అనుమానం, భయం ఉన్నాయి. బాటసారి, నాలుగు రోడ్ల కూడలిలో నిలబడి గమ్యం చేరవల్సిన బాట కోసం వెనుక ముందవుతున్న తీరులో వాళ్ళిద్దరూ అటూ ఇటూ అవుతున్నారు.

"ఇంతకీ ఈ సంబంధానికి సుమిత్ర ఏమంటుందో...." లక్ష్మి అనుమానంగా అంది.

రామానుజం లక్ష్మి కళ్ళల్లోకి చూసి, "లేని భయాలు దాని బుర్రలోకి జొప్పించకు. ఏవీ నూరిపొయ్యకు. సరేనా..."

"నాలా, అదేం తెలివి తక్కువది కాదు..."

రామానుజరం నవ్వాడు. లక్ష్మి మొహం ముడుచుకుంది.

❖ ❖ ❖

ఆ వేళ సుమిత్ర పెళ్ళిచూపులు. సుమిత్రా, రమేష్ చాలా సంవత్సరాల తర్వాత

ఒకళ్ళనొకళ్ళు చూసుకున్నారు. ఇల్లంతా ఒకటే సందడి. లలిత లక్ష్మికి చాలా దగ్గరగా వెళ్ళి మాట్లాడింది. పనుల్లో చేతులు కల్పింది. లక్ష్మి కూడా లలిత పుట్టింటి వైపు వారి గురించి అడిగింది. అత్తగారి యోగక్షేమాలు అడిగింది. వాళ్ళు ఇద్దరూ కూడా ఏళ్ళ క్రితం దూరం గురించి సింహావలోకనం చేసుకుందామనుకుంటూంటే – ఎవరు ముందో తెలియని చందాన ఎవరి మెట్టు మీద వాళ్లు ఉండిపోయారు. అటు రామానుజం సుందరం మాత్రం మనుసులు విప్పి మాట్లాడుకున్నారు. ఎటొచ్చి రమేశ్ ఇంట్లో ఉండలేక – బయటకు వెళ్ళి కాలు నిలవకా తెగ అలసట పడ్డది!!

పెళ్ళి చూపుల సమయంలో సుమిత్ర అరగంట సేపు తల వంచుకుని కూర్చుని తద్వారా కలిగిన మెడ నొప్పికి తలవంచింది. తర్వాత కట్టుకున్న పట్టు చీర తన బరువుతో దిగలాగుతూంటే ఓర్చుకుంది. ఆ పైన స్నేహితులు అలంకరణ పేరుతో మొహానికి పులిమిన రంగుల కేక్‌లకు, డ్రై పౌడర్లతో మొహం చిరచిరలాడుతూంటే భరించింది.

తండ్రి 'నువ్వు లోపలికి వెళ్ళవచ్చే ఇక' అంటూ అరగంట తర్వాత క్లీన్‌చిట్ యిస్తే గబగబా బెడ్ రూమ్‌లోకి వెళ్ళి పట్టు చీర విప్పి దణ్ణెం మీదకు విసిరి వేసింది. ఆ జాగాలో నీలం పువ్వులున్న కాటన్‌మేక్సీ వేసుకుంది. వెంటనే బాత్‌రూమ్‌కు వెళ్ళి మొహానికి కొబ్బరి నూనె పులుముకుని మేకప్ కడుక్కుని నీళ్ళతో మొహం కడుక్కుంది. అప్పటికి ప్రాణం తేలిక పడ్డట్టయ్యింది.

అప్పుడే అటు వచ్చిన లక్ష్మి కూతుర్ని చూసి, "ఇదేమిటే కోపగృహంలో సత్యభామలా ఈ అవతారం... అత్తయ్య చూస్తే బావుండదు..."

"ఫంక్షన్ అయింది కదమ్మా..."

"చాల్లే బడాయి..." అంటూ లక్ష్మి బయటకు వెళ్ళింది. 'నాకేమయ్యింది. అమ్మకు మతిలేదు. అత్తయ్య తల కొట్టి మొలేస్తుందా ఇలా వుంటే' అనుకుని తనలో తనే నవ్వుకుంది. గుమ్మం వరకూ వెళ్ళి డ్రాయింగ్ రూమ్‌లోకి తొంగి చూడబోయి, అడుగు ముందుకు వేస్తే తన ఉనికి తెలిసి పోతుందనే చిన్న భయంతో మగవాళ్ళ పాదాలు మాత్రమే కన్పిస్తూంటే వెనక్కి తిరిగింది. సరిగ్గా అప్పుడే లలిత లోపలికి వచ్చింది. సుమిత్ర అడుగుల చప్పుడుకు వెనక్కి తిరిగి చూసింది.

"నువ్వా అత్తయ్యా" అని నోరు కరుచుకుని 'మీరా అత్తయ్యా' అంది.

"నేను కాక ఎవరు లోపలికి వస్తారనుకున్నావ్ సుమీ" అంది లలిత అతి సహజంగా. సుమిత్ర మాట్లాడలేదు. ఎత్తిన కళ్ళు జవాబుగా వాల్చింది.

"ఎప్పుడో చిన్నప్పుడు చూశాను. పొడుగెదిగావు. మీ బామ్మ పోలికే నీది..." సుమిత్ర ఈసారి నవ్వింది... జవాబుగా కళ్ళెత్తి చూసింది.

"ఇందాకా అక్కడ ఏం తిన్నావో, కాస్త టిఫిన్ చేయాల్సింది మళ్ళీ..."

"ఫరవాలేదు"

లలిత అటూ ఇటూ చూసి గుమ్మం దాకా వెళ్ళి తలుపు టవర్ బోల్ట్ వేసి, "నీతో మాట్లాడాలి సుమీ..." అంది.

"ఏమిటీ" అని. "కూర్చోండి" అంది.

లలిత కుర్చీలో కూర్చుని, ఆ పైన పమిటతో మొహం తుడుచుకుని ఫేన్‌గాలి కోసం తలెత్తి... 'నువ్వూ కూర్చో అలా' అంది. సుమిత్ర మంచం మీద ఓ పక్కగా గోడకానుకుని కూర్చుంది.

"అదే, మా వాడు రమేశం నీకు నచ్చినట్టేనా?" అంది చటుక్కున.

సుమిత్ర ఆ ప్రశ్నకు ఆశ్చర్యపోయినట్టు రెండు కళ్ళూ పెద్దవి చేసి జవాబు వెంటనే చెప్పలేని స్థితి నుంచి తప్పించుకోవడం కోసం కళ్లు వాల్చింది. ఓసారి చేతులు రెండూ కలుపుకుంది.

"నేను బావని చూశానంతే. నచ్చాడో, లేదో అంటే" సుమిత్ర ఆగిపోయింది.

"చెప్పు. ఫర్వాలేదు".

"బావున్న వాళ్ళందరూ నచ్చుతారనీ – నచ్చిన వాళ్ళందరూ బావుంటారని ఎలా చెప్పగలం"

లలిత చిన్నగా నవ్వి "తెలివయినదానివే" అంది.

సుమిత్రే అంది. "పోనీలే అత్తయ్యా. నేను నీకు నచ్చానా?"

"బ్రహ్మాండంగా ఉన్నావ్."

"సుమిత్ర కాసేపు ఆగి, అత్తయ్యా ఏమీ అనుకోనంటే నిన్నో మాట అడగాలని వుంది."

"అడుగు"

"మళ్ళీ ఏమీ అనుకోకూడదు."

"ఏమిటో చెప్పు."

"మీ సంబంధం గురించి అమ్మ నాన్నా చెప్పారు. మన కుటుంబ కలహం గురించి నాకూ కొద్దిగా తెలుసు. అవి కలహాలు కాదేమో. అపోహ లేనేమో. నేను మా నాన్న మనసును పూర్తిగా అర్థం చేసుకున్నానని చెప్పలేను గానీ – ఆయనకు నానమ్మను తన దగ్గర అట్టే పెట్టుకోవాలని వుంది."

"నిజమే..."

"నాన్నమ్మకు మీ దగ్గర అన్ని విధాలా బావుండి ఉండచ్చు. శాంతిగానూ ఉండచ్చు. కానీ ఈ వేళ మా నాన్న ఆ రెండింటినీ తల్లికి దగ్గరగా వుండి యివ్వాలనుకుంటున్నాడు. ఆయన ఉద్దేశం తప్పంటారా?"

"మా అమ్మను నేను బలవంతంగా గానీ, శాసనపరంగా గానీ నా దగ్గర ఉంచుకోలేదు. అప్పటి పరిస్థితుల్లో వేరే దారి ఏదీ కన్పడలేదు. అందరకూ తెలుసు, ఇది కాని పని అని! కానీ కాలం.. కాని పనిని నిత్యకృత్యంగా మార్చివేసింది..." లలిత తలవంచుకుని అంది.

"నిజమే అత్తయ్యా. నూరుపాళ్ళు తప్పు నాన్నదీ ఆపైన చిన్నాన్నదీ. ఆయన తన తప్పు తెల్సుకున్నాడు. అమ్మ కూడా మారిందత్తయ్యా..." సుమిత్ర కంఠం బొంగురుపోసాగింది.

లలిత కాసేపు ఆగి, "నిజం చెబుతున్నాను. మీ నాన్నమ్మ ఇక్కడకు వచ్చి ఉంటానంటే నాకేం అభ్యంతరం లేదు. మొన్న నేనూ, మీ నాన్నా, మీ మావయ్యా కూడా చెప్పి చూశాం... ఊహు ఆవిడ వినలా..." అంది.

సుమిత్ర నెమ్మదిగా అంది, "ఒకవేళ ఈ పని జరగకపోతే ఈ పెళ్లి కూడా జరగదత్తయ్యా. నేను బావ నచ్చాడని చెప్పడం, పెళ్ళికి 'ఊ' అనడం, నాన్నమ్మ మా ఇంటికి వచ్చిన తర్వాతే.."

లలిత అత్యంత ఆశ్చర్యంగా, బొమ్మలా మారి సుమిత్ర వైపు చూస్తూ ఉండిపోయింది. ఆమెకు ఏం చెయ్యాలో, ఏం అనాలో కూడా అర్థం కాలేదు.

"మనం లేద్దాం అత్తయ్యా. నన్ను క్షమించు. నా మనసులో ఉద్దేశాన్ని ఉన్నదున్నట్టు చెప్పాను. నిన్ను అగౌరవపర్చాలనీ, అవమాన పర్చాలనీ కాదు. నా కోరిక అల్లా – మాకు మంచి అత్తయ్యతోపాటు మంచి నాన్న కూడా ఉన్నాడనిపించుకోవడం! ఇది మా అందరి ఆశే. తప్పు చేసిన మా నాన్నకు ఒప్పు చేసే అవకాశం, మీరూ మామయ్యా యివ్వండి... ప్లీజ్..."

సుమిత్ర చప్పున మంచం మీద నుంచి లేచి లలిత చేతులు పుచ్చుకుని మనసులోంచి వచ్చే బాధను నొక్కి పెట్టే ప్రయత్నంలో గొంతుకను అదిమిపడుతోంది... అప్పుడు సుమిత్ర కళ్ళల్లోంచి జారి తన చేతి మీద పడ్డ రెండు కన్నీటి చుక్కల్ని చూసిన లలితకు బాధ ఆగింది కాదు. అది అనుభవాన్నీ వయసునీ కూడా లెఖ్ఖ చేయకుండా ఒక్క ఉదుటున బయటపడుతుందేమోనన్న భయం ... అంతవరకూ ఉన్న వాతావరణం, అవతల కాస్తంత దూరంలో వున్న వ్యక్తులు తలక్రిందులయి అటూ ఇటూ అవుతారన్న భీతి....

అందుకే లలిత, "నువ్వు కాస్సేపు రెస్ట్ తీసుకో. మంచం మీద పడుకో. నేనున్నాను.. నీకేం భయం లేదు" అని తలుపు తీసి డ్రాయింగ్ రూమ్‌లోకి కాకుండా, దొడ్డి వైపు నాలుగు అడుగులు వేసింది.

❖ ❖ ❖

"ఒరేయ్ రామచంద్రం, రామచంద్రం" అంటూ జానకమ్మ గారు వాకింట్లోంచి రెండుసార్లు గొంతెత్తి అరిచింది. ఆ రోజు ఆవిడకు కాస్తంత నీర్సంగా నలతగా ఉంది. కూతురు, అల్లుడు, పెద్ద మనవడు రమేశం విజయవాడ వెళ్ళారన్న సంగతి తెలుసు. మరోసారి మంచం పక్కన స్టూల్ మీద వున్న చిన్న రాగి చెంబు గోడకేసి కొట్టి 'రామంగా, రామంగా' అని పిల్చింది. అప్పుడు అవతలి గదిలో చదువుకూంటున్న రామచంద్రం అమ్మమ్మ పిలుపు విన్నాడు.

"ఏం కావాలి అమ్మమ్మా"

'ఇప్పుడు టైం ఎంతయిందిరా"

"ఐదు"

"అమ్మా నాన్న అన్నయ్యా ఎప్పుడు వస్తారంటావ్."

రామం రైళ్ళ రాకపోకల గురించి చెప్పాడు.

"రామం, అదోలావుందిరా... కాసిన్ని మంచి నీళ్ళివ్వరా.."

రామం వంటింట్లోకి వెళ్ళి, నీళ్ళు తెచ్చి తను అమ్మమ్మ పక్కన కూర్చుని, ఆమెను నెమ్మదిగా వీపు వెనుక చేయి వేసి లేపి కూర్చోబెట్టాడు. ఆమెను తన గుండెలకు సగం వరకూ ఆన్చుకున్నాడు.

"ఏమిటోరా... నా ఆయుష్షు ఎంతో తెలియకుండా వుంది..."

"సరేలే, నీళ్లు చాలా, నే వెళ్ళనా.."

"ఆవిడ నెమ్మదిగా, ఒరే రామం... ఆగు, చెప్తాను – కూర్చో"

"ఏమిటి అమ్మమ్మా... కాసేపు పడుకోరాదా..."

"నిన్న మన కృష్ణమూర్తిగారి కోడలు లేదు... సుధ చేత రామానుజం మామయ్యకి ఉత్తరం వ్రాయించాను. ఆ పిల్లకాయ ఏం తప్పులు వ్రాసిందో, ఓ సారి చదివి విన్పిస్తావా... ఆ తర్వాత తపాల పెట్టెలో పడేయ్యి... సరేనా" అంటూ తలక్రింద ఉత్తరం తీసి మనవడి చేతిలో పెట్టింది.

రామం ఉత్తరాన్ని అటూ ఇటూ చేసి 'ఆఖర్ని సంతకం కూడా చేశావే – జానకమ్మ వ్రాలు..." అని అంటూ నవ్వేశాడు.

"సంతకం చేయకపోతే ఉత్తరం విలువ ఉండదురా. అది చిత్తు కాగితంతో సమానమవు తుంది. చదువు... ఆ... తప్పులేమన్నా ఆ పిల్ల వ్రాస్తే ఆనక జాగ్రత్తగా దిద్దు... మర్చిపోకు..." రామం కాగితాలు సరిజేశాడు.

"అవునురా.... నిన్న రాత్రి నాకు ఆయాసం రాలేదు. వళ్లు దాంతో తేలిగ్గా వుంది..."

"మంచిదే... నిన్న శివుడి గుళ్లో సహస్రనామ పూజ చేయించమన్నావు కదా... దాని లాభం ఇది..."

"ఈ వేళ తిథి ఏమిట్రా."

"ఉత్తరం చదవనా, పంచాంగం పట్టుకురానా అమ్మమ్మా" చిన్నపాటి విసుగుతో అన్నాడు రామచంద్రం.

గులకరాళ్ళను తప్పించుకుని వెడుతూ సెలయేటి పాయ చేసే చప్పుడులాంటి అతి చిన్న నవ్వు తేలికగా ఆవిడ నోటి నుంచి ఇట్టే వచ్చి ఆగింది.

"విను అయితే"

"ఆ... కానివ్వరా...."

రామానుజానికి –

నువ్వూ, లక్ష్మీ, పిల్లలూ కులాసాగా ఉన్నారని తలుస్తాను. అక్కా, బావ, రమేశం పెళ్ళిచూపుల నిమిత్తం అక్కడకు వచ్చారు కదా? అంతా శుభం అవుతుంది. భగవంతుడు నీ పక్షాన ఉంటాడు.

ఇక – మొన్న నువ్వు వచ్చినప్పుడు నీతో నన్ను రమ్మనమని అడిగావు. నేను నీ మనసును నొప్పించాను. అదేమిటో – నాకు మన ఊరు మనిల్లు అంటే తగని అభిమానం.. నేను ఎనభై ఏళ్ళ క్రితం ఈ యింట్లో పుట్టాను. అప్పుడిది మండువా లోగిలి. తరువాత ఆకారాలు మార్చుకుంటూ వస్తోంది. ఇల్లూ మనుషులూ ఒకటేనేమో! పైగా ఇంటిలాగే మనసును పరిశుభ్రంగా ఉంచుకోవాలంటారు భగవంతుడు. మనుషుల హృదయాల్లో స్థిరనివాసం ఏర్పరుచుకునే ముందు చుట్టూ వాతావరణం పరిశీలిస్తాట్ట! ఆ తరువాతే మనల్ని గుర్తిస్తాట్ట... ఇవన్నీ మీ నాన్నగారు కలలో కనబడి చెప్తూ ఉండేవారు. నాకు నమ్మకం కుదరక సుందరంతో అనేదానిని. అతను నవ్వి అన్నీ నిజమేనని రూఢీ చేసేవాడు. అందుకే నేను వీధి గుమ్మానికి ఎదురుగా మంచం వేసుకున్నాను.

మరో విషయం. నాకు నా పిల్లలయిన మీ మీద, కోడళ్ళ మీద ఏ కోపతాపాలులేవు. కోరికలు ఆపేక్షలూ లేవు. మీ కన్నా పెద్దదాన్నయి వుండి, అన్నీ తెలిసుండి మిమ్మల్ని మాటలన్నాను – ఆనాడు తప్పే... నువ్వూ తమ్ముడూ నాకేమీ చేయలేకపోయామని బాధపడద్దు. ఈ సేవ అనేది – ఫలానా మనిషికేనని ఎక్కడా లేదు. బాధలో కష్టాల్లో ఉన్న వాళ్ళందరూ మనవాళ్ళు అనుకుంటే చాలు. ఎన్నో కష్టాలు మరెన్నో అవస్థలు అనుభవించిన వాళ్ళకే గొప్ప అవకాశాలు గొప్ప అదృష్టమూ కలిసివస్తాయిట. ఈ విషయాలు సుందరం చెప్తూంటే – నాకు ఊరట కలిగేది. మన చుట్టూ ఎంతోమంది జనం ఉంటారు. వాళ్ళను మనకు దగ్గర చేసేదీ – దూరం చేసేదీ కూడా ఆయన. మనం నిమిత్త మాత్రులం. సుందరం సంగతే చూడు. అతని దగ్గరకు వచ్చిన కొత్తలో నేను తిక్క మనిషిని. అతను నన్ను ఆదరిస్తే చాలని ఆశపడేదాన్ని. ఆదరించడేమోనని భయపడేదాన్ని... ఆపైన మీ నిరాదరణ గుర్తు చేసుకుని కుమిలిపోయేదాన్ని. కానీ సుందరం తన బిడ్డలతోపాటు నన్నూ ఓ బిడ్డగా పెంచాడు. పెద్ద చేశాడనిపిస్తుంది. గురువుగా, తండ్రిగా మారి ప్రేమతో మాట్లాడేవాడు. అతన్ని చూసి నేను చాలాసార్లు సిగ్గుపడేదాన్ని. ఆ తర్వాత తెలిసొచ్చింది – దేవుడే నాకు అల్లుడయి పుట్టాడని! అలాంటి సుందరంతో వియ్యం అందడం, నీ అదృష్టం...

ఇప్పుడు, ఈ మధ్య మీ నాన్న రోజూ నా కలలోకి వస్తున్నారు. ఆయన ఏవేవో చెప్తుంటారు. రాత్రి ఆయన చెప్పినవన్నీ గుర్తుంచుకుని, అవి దైవానికి విన్నవించుకుంటున్నాను. ఇది నా నిత్య కృత్యం అయిపోయిందనుకో.... పూర్వంలో నా శరీరం, ఆత్మా 'నేను బరువంటే నేను బరువని' బేటీలు పడుతూ నన్ను ఓ ఆట ఆడించేవి.

రాగద్వేషాలు అనే ఈ అపరిపక్వ దశ నుంచి మనిషి బయటపడలేదనీ – వాటిని జయిస్తేనే, ఆత్మ ఓ వికసించిన పుష్పమంత తేలిక అవుతుందనీ – అప్పుడు శరీరం ఆత్మను భరించగలుగుతుందనీ సుందరం అర్థం చెప్పేవాడు. మీ అందరికీ నా ఆశీస్సులు.

అమ్మ, జానకమ్మగ్రాలు..."

ఉత్తరం తాలూకు కాగితాలు ముడుస్తూ రామచంద్రం, "అయిందమ్మమ్మా నీ కథ..." అన్నాడు.

జానకమ్మ "అవునురా బాలవాక్కు బ్రహ్మవాక్కు అంటారు. నా కథ ..." అంటూ ఆగి ఓ సారి కళ్ళు మూసి, తిరిగి తెరిచి 'ఒరేయ్ మరి కొంచెం నీళ్ళు కావాలిరా... అవునురా నాలుగు తులసి ఆకులు అందులో పడెయ్యి... హాయిగా వుంటుంది..." అంది. రామచంద్రం అమ్మమ్మ వైపు చూస్తూ ఆమె మొహంలో వస్తూన్న కదలికలు చూసి, 'ఏమిటి అమ్మమ్మా' అని భయంగా చూసి వంటింటివైపు చురుగ్గా అడుగులువేశాడు. నీళ్ళు తెచ్చాడు. జానకమ్మ తన చిన్న నోరు తెరిచింది. ఆవిడది బోసి నోరు... బీడుపడిన భూమిలో ఓ లోతట్టుగొయ్యిలా వుంది – అది!! అందులో – ఎప్పుడో, ఎన్నడోపుట్టి ఎండడానికి ముందు తన గులాబీ రంగుతనాన్ని పోగొట్టుకున్న దళం లాంటి నాలిక... రామచంద్రం గోతిలా కన్పిస్తున్న ఆవిడ గొంతుక లోకి నీరు నెమ్మదిగా పోశాడు. అప్పుడు, అప్పుడు అందులోంచి మాటలు హీనస్వర సమ్మిళతమై అక్షరాలు క్షయమవుతోన్నట్టు బాధగా బయటకు రాసాగాయి.

"అమ్మమ్మా..."

జానకమ్మ గొంతులోకి కష్టంగా దిగుతున్న నీటిని అతి కష్టంగా గుటకలు వేస్తూ బరువయిపోతున్న చేతుల్ని ఎత్తలేకపోతున్నట్టు, నీర్సంతో వాటిని సగం వరకూ లేపి, మనవడి పట్టుకొమ్మ లాంటి చేతులతో కలిపింది.

"ఒరేయ్ రామం... నాకు పిలుపు వస్తోందిరా ... శెలవవుతోందిరా చిట్టి కన్నా... నువ్వు వెళ్ళు. పక్కింటి తాతగార్నీ, బామ్మగార్నీ పిలుచుకురా... వెళ్ళమ్మా..." అంటూ తన అంతిమ క్షణాల్ని ఏకాంతంలోకి మిళితం చేయసాగింది.

అంతే... మృత్యువు తనప్రభావాన్నీ ప్రతాపాన్నీ జానకమ్మ మీద చూపించింది. విధి – మనిషి, తాలూకు ముందు మాటలూ ఆఖరి మాటలూ తనే లిఖించగలనని విర్రవీగివెర్రి నవ్వు నవ్వింది. కానీ... కానీ – చేతికి అందకుండా అతి చాకచక్యంగా శరీరంలోంచి తృటికాలంలోపునే తప్పించుకుపోయిన ఆత్మకు అవరోధం కల్పించడం తను వల్ల కాదని, ఇటు మృత్యువు అటు విధి కూడా తెల్సుకోలేకపోయాయి. వాటికి ఆత్మ, పరమాత్మల మధ్య వున్న అనుబంధం తెంచడం అసాధ్యమని తెలియదు.

❖